క్లుప్తంగా

24 నుంచి వలంటీర్ స్థానాల భర్తీకి ఇంటర్వ్యూలు

రేపల్లె: పట్టణంలో ఖాళీగా ఉన్న వలంటీరు స్థానాలను భర్తీ చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24 నుంచి 27 వరకు మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ విజయసారథి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో మొత్తం 39 వలంటీరు స్థానాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 24న 1 నుంచి 7 వార్డులకు చెందిన అభ్యర్థులకు, 25న 8 నుంచి 14 వార్డులకు, 26న 15 నుంచి 21 వార్డులకు, 27న 22 నుంచి 28 వార్డులకు సంబంధించిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా ప్రచారం

రేపల్లె రూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం, సీపీఐ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి మణిలాల్ తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయనతోపాటు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నాగాంజనేయులు, రేపల్లె ఏరియా కార్యదర్శి జి.బాలాజీ, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలకు శిక్షణ

భట్టిప్రోలు: రైతు ఉత్పత్తి సంఘాలకు (ఎఫ్‌పీజీ) వ్యవసాయ అనుబంధ పరికరాలు, సేంద్రియ సేద్యంపై శిక్షణ ఇస్తున్నట్లు మండల సమాఖ్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ గుడిమెట్ల శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. భట్టిప్రోలులోని మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీసీలు కొలకలూరి రజనీకుమారి, దాసరి హనోకు, కొండెపాటి సాంబయ్య, బాపట్ల డీసీవో కార్యాలయ అధికారి వెంకటేశ్వరరావు, మండల సమాఖ్య ఎఫ్‌పీవో అధ్యక్షురాలు దోవా ఝాన్సీరాణి, అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలి

రేపల్లె రూరల్: రైతులకు వ్యవసాయ అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి విజయ్‌బాబు చెప్పారు. ఉప్పూడిలో సోమవారం గ్రామ రైతులు, రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారులకు భూసార పరీక్షలు నిర్వహించే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో పలుచోట్ల భూసార పరీక్షలకు మట్టి నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో రైతులు, ఏఈవోలు, వీఏఏలు పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టర్ బోల్తా

కొల్లూరు : కరకట్టపై గడ్డి ట్రాక్టర్ బోల్తా పడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిన ఘటన సోమవారం కొల్లూరు వద్ద జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కృష్ణా జిల్లా నుంచి గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను లాక్ సెంటర్ వద్ద కరకట్టపై ఎదురు వచ్చే వాహనానికి దారి ఇచ్చేందుకు డ్రైవర్ పక్కకు మళ్లించాడు. రోడ్డు కిందకు దించడంతో గడ్డి లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ ట్రక్కు అదుపు కోల్పోయి పక్కకు పల్టీకొట్టింది. ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్, కూలీలు ఇంజిన్ నుంచి కిందకు దూకడంతో ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు. ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో విజయవాడ-రేపల్లె కరకట్టపై వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం వాటిల్లింది. స్థానికుల సహకారంతో బోల్తాపడిన ట్రాక్టర్‌లోని గడ్డిని వేరే ట్రాక్టర్‌లోకి ఎక్కించి తరలించారు.

నవధాన్యాల సాగుపై గడప గడపకు ప్రచారం

చంపాడు(వేమూరు): నవధాన్యాల సాగుపై ఇంటింటి ప్రచారం చేస్తామని ప్రకృతి విభాగం జిల్లా అధికారి వరగాని వాణిశ్రీ తెలిపారు. జంపని యూనిట్ పరిధిలో సోమవారం ఆమె కరపత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులందరూ నవ ధాన్యాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. ప్రకృతి సేద్యంలో పెట్టుబడి తక్కువ, దిగుబడులు ఎక్కువ సాధించనున్నట్లు వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులందరూ నవ ధాన్యాలు సాగు చేయాలని, ప్రకృతి సేద్యంపై మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో పులివర్తి రజని, శ్రీకాంత్, మాలెంపాటి అరుణ బాబు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన గొప్ప సీఎం జగన్

- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు
- గుళ్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారుడిని అడిగి తెలుసుకుంటున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క హామీతోపాటు ఇవ్వని హామీలనూ నెరవేర్చారని, రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. గుళ్లపల్లి గ్రామంలో మూడో రోజు సోమవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు, స్థానిక నాయకులు అధికారులతో కలిసి పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, అలాంటి గొప్ప ముఖ్యమంత్రిని ఎన్నుకోవడం మన అదృష్టమని పేర్కొన్నారు. గ్రామంలో మంచినీటి సమస్యను పలువురు ఎంపీ మోపిదేవి దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందాలంటే 2024లోనూ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, జెడ్పీటీసీ మరివాడ పావని, బాపట్ల జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చీరాల ప్రసాద్‌రెడ్డి, చెన్ను కోటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ షైనం ఏడుకొండల రెడ్డి, ఉల్లంగుంట శ్రీరాంమూర్తి, కాటూరి కృష్ణయ్య, ఉల్లంగుంట జాన్‌సైదులు, షేక్ జాన్‌సైదా పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్


మోర్తోటలో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


రేపల్లె పట్టణంలోని 10వ వార్డులో..


రేపల్లె మండలం పేటేరులో..


నిజాంపట్నం మండలం వీరంకివారిపాలెంలో..


నగరం మండలం కట్టవలో..


చుండూరు అంబేడ్కర్ నగర్‌లో..

రేపల్లె/నిజాంపట్నం/నగరం/వేమూరు/భట్టిప్రోలు: రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల్లో 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా సాగింది. రేపల్లె పట్టణం, మండల పరిధిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్‌లు, సచివాలయాల కన్వీనర్‌లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించారు. గత ప్రభుత్వ దురాగతాలను ఎండగట్టారు. రేపల్లె 10వ వార్డులో వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అడ్వైజర్ అల్లంశెట్టి శ్రీనివాసరావు, కౌన్సిలర్ వీరెళ్ల లక్ష్మీప్రసన్న, 18వ వార్డులో అద్దేపల్లి వెంకటస్వామి, రేపల్లె మండలం మోర్తోట గ్రామంలో సర్పంచ్ కారాని కృష్ణకుమారి, చాత్రగడ్డలో ఎంపీటీసీ మేడికొండ సుధాకరచంద్ర హాసరావు, పేటేరులో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, సర్పంచ్ వసుమతి తదితరులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- నిజాంపట్నం మండలంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వీరంకి ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో అడవులదీవి వీరంకివారిపాలెంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు సచివాలయ కన్వీనర్ వీరంకి అంకయ్య పాల్గొన్నారు.
- నగరం మండలంలోనూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కట్టవ గ్రామంలో సర్పంచ్ షేక్ షెజనాజ్‌సుల్తానా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.
- చుండూరు అంబేడ్కర్ నగర్‌లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఎంపీపీ జాలాది రూబేను ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ అన్నపరెడ్డి వీరారెడ్డి, సర్పంచ్ మేడికొండ విజయభాస్కర్ పాల్గొన్నారు.
- భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు(చినబుజ్జి) పాల్గొన్నారు. భట్టిప్రోలు–1, 2 సచివాలయాల పధిలో జరిగిన కార్యక్రమాలలో వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, పీజీ అరుణ్ శాస్త్రి, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం(చిన్నారి), తలకొల యలమంద, షేక్ అబ్దుల్ కరీమ్, పెరికల శ్యామ్, కె.ప్రసాదు దాసరి ఫణీంద్ర, వలంటీర్లు పాల్గొన్నారు. ఓలేరులో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మేరుగ రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు నీలా సాంబమ్మ, సచివాలయ కన్వీనర్ రజినీకాంత్, వైఎస్సార్ సీపీ నాయకులు పరుచూరి వేణు పాల్గొన్నారు.


భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో..


భట్టిప్రోలులో..

సంక్షిప్త వార్తలు

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు



కర్లపాలెం: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ యారం వనజ అధికారులకు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ యారం వనజ మాట్లాడుతూ అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



నిజాంపట్నం: అంకితభావంతో పనిచేసే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ తప్పని సరిగా గుర్తింపు లభిస్తుందని అడవులదీవి ఎస్‌ఐ వెంకట రవి తెలిపారు. అడవులదీవి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న డి.పాపిరెడ్డి బదిలీపై నిజాంపట్నం వెళ్తుండడంతో సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సన్మాన సభ నిర్వహించారు.

విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు

రేపల్లె: విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడితే బీజేపీకి పుట్టగతులు ఉండవని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నాగాంజనేయులు చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు రేపల్లె బస్టాండ్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించారు. కార్యక్రమంలో సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఎస్‌ఐ అబ్దుల్‌రజాక్ నిరసనకారులను అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఆకట్టుకున్న అంబేడ్కర్ జీవిత చరిత్ర ప్రదర్శన

అద్దేపల్లి(భట్టిప్రోలు): అద్దేపల్లి దళితవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాన్ని మూడురోజులపాటు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో తమిళనాడులోని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, సీఐటీయూ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ గంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, కేవీపీఎస్ నాయకులు జి. సుధాకర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు పప్పల మనోజ్ కుమార్, వి.భగవాన్‌దాస్ పాల్గొని తమ సందేశాలు అందించారు. చిన్నారులు అంబేడ్కర్ జీవిత చరిత్రను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. చిన్నారులకు ఆటల పోటీలు, అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన 30 మందికి గ్రామానికి చెందిన దాసరి మనోజ బహుమతులు అందించారు. చదువులో ప్రతిభ చూపిన వారికి దాతలు నగదు ప్రోత్సాహకాలు అందించారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ఏట్రవారిపాలెం(కర్లపాలెం): ఉపాధిహామీ పనులను వినియోగించుకోవాలని ఏట్రవారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి తెలిపారు. ఏట్రవారిపాలెంలో సోమవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను సర్పంచ్ వెంకటలక్ష్మి ప్రారంభించారు. టెక్నికల్ అసిస్టెంట్ శివయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, చీరాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

స్త్రీశక్తి భవన నిర్మాణానికి సహకరించాలి

కర్లపాలెం: స్త్రీశక్తి భవనం నిర్మాణానికి సహకరించాలని మండల సమైక్య ప్రతినిధులు తహసీల్దార్ జి.కేశవనారాయణరావును కోరారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ స్త్రీ శక్తి భవనం నిర్మించేందుకు గతంలో స్థలం మంజూరు చేశారని ఆ స్థలాన్ని తిరిగి తమకి స్వాధీనపరిచి భవనం నిర్మాణానికి సహకరించాలని కోరారు. భవనం నిర్మించుకునేందుకు కృషి చేస్తున్నామని, తమవంతు సహకారం అందించాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, మండల సమాఖ్య ప్రతినిధులు నాగలక్ష్మి, నసీమా, శివకుమారి, శ్రీలక్ష్మి, మార్తమ్మ, శివపార్వతి, మంజుల, భార్గవి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే కోన ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: రంజాన్ మాసం సందర్భంగా కర్లపాలెం మండల పరిధిలోని ముస్లింలకు ఎమ్మెల్యే కోన రఘుపతి సోమవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎంవీ రాజుపాలెం షాదీఖానాలో, పాత ఇస్లాంపేటలోని మసీదులో, కర్లపాలెం సెంటర్‌లోని మసీదులో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కోన పాల్గొని ముస్లింలకు ఇఫ్తార్ విందును వడ్డించారు. అనంతరం ముస్లిం మతపెద్దలు ఎమ్మెల్యేను సన్మానించారు. పేరలి, గణపవరం, నాగరాజుపాలెం గ్రామాల్లోనూ ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు, మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గుంద్రెడ్డి శివ, వైఎస్సార్ సీపీ మండల యువజన అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, కోఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్‌బేగ్ పాల్గొన్నారు.

స్పందనతో సమస్యల పరిష్కారం


అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి

రేపల్లె రూరల్: ప్రజల సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి చెప్పారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్పందనకు ఆరు అర్జీలు అందాయన్నారు. నిజాంపట్నం మండలం కళ్లిఫలం గ్రామంలో ఎస్టీల శ్మశానవాటికకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్తులు, పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారని పేర్కొన్నారు. నిజాంపట్నంలో ఆక్రమణకు గురైన శ్మశానవాటికకు సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని ఒక అర్జీ, నగరంలో డొంక పోరంబోకులో ఆక్రమణ తొలగించాలని మరో అర్జీ, తమ స్థలం సర్వే చేసి హద్దులు చూపించాలని రేపల్లె పట్టణం నుంచి రెండు అర్జీలు, జంపనిలో బాప్టిస్ట్ సంఘం సమస్యను పరిష్కరించాలని ఒక అర్జీ అందిందని ఆర్డీఓ వివరించారు. సమస్యలపై పరిశీలన జరిపి పరిష్కరిస్తామని చెప్పారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ చిరస్మరణీయులు


నివాళులు అర్పిస్తున్న ఫోరం సభ్యులు

బాపట్ల అర్బన్: ఉపాధ్యాయ వృత్తికి వన్నె, గౌరవం తీసుకువచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిరస్మరణీయులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు చెప్పారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా సోమవారం ఫోరంఫర్ బెటర్ బాపట్ల మండల కార్యాలయం వద్ద రాధాకృష్ణన్ వర్ధంతి సభ నిర్వహించారు. రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో క్రైమ్ రికార్డ్స్ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు, మల్లికార్జున, న్యాయవాది భాస్కరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం

రేపల్లె రూరల్: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫైర్ ఆఫీసర్ సాంబశివరావు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా 4వ రోజు పట్టణంలోని వివేకానంద స్కూలులో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రమాదం సంభవించిన వెంటనే ఆందోళన చెందకుండా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పెట్రోలు బంకుల వద్ద సెల్‌ఫోన్ మాట్లాడటం, ధూమపానం చేయరాదన్నారు. గృహాలలో, దుకాణాలలో విద్యుత్ వైర్లు సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది ఎం.నాగేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, డి.పాండురెడ్డి, ఎస్.నాగరాజు, పి.హరిబాబు పాల్గొన్నారు.

బాపట్లటౌన్: అగ్నిప్రమాదాల నివారణ అందరి బాధ్యతని అగ్నిమాపకాధికారి వెంకటేశ్వరరావు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని బాపట్ల పబ్లిక్ స్కూల్‌లోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మంటలు ఆర్పే విధానంపై డెమో ఇచ్చారు.